సాక్షి
ప్రకాశం
గురువారం । 19 । జూన్ । 2025



చంద్రబాబు అంటేనే మోసం

చంద్రబాబు ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా మోసగించాడని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు.

- 10లో..



కూటమి చేత'బడి'

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ఫేజ్ 2 కింద చేపట్టిన పనులు కూటమి ప్రభుత్వంలో అటకెక్కాయి.

- 10లో..

గరిష్టం/కనిష్టం
38 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా ఈశ్వర్ చంద్



బట్టు ఈశ్వర్ చంద్

ఒంగోలు సబర్బన్: డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా బట్టు ఈశ్వర్ చంద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈశ్వర్ చంద్ బదిలీపై ప్రకాశం జిల్లాకు వచ్చారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఈయనే డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా విధులు నిర్వర్తించనున్నారు. ఒంగోలు కర్మాగారాల తనిఖీ అధికారి–1, 2 కు కూడా ఈయనే ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.శైలేంద్ర కుమార్ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఓల్డ్ రిమ్స్ ప్రాంగణంలోని పాత మైన్స్ కార్యాలయాన్ని జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయానికి కలెక్టర్ కేటాయించారు.

దేవరంపాడులో పర్యాటక కేంద్రానికి భూముల పరిశీలన



దేవరంపాడులో భూములు పరిశీలిస్తున్న జేసీ గోపాల కృష్ణ, ఆర్డీఓ, రూరల్ తహశీల్దార్‌లు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు రూరల్ మండలం గుండాయపాలెం మజారా దేవరంపాడు గ్రామంలోని ప్రభుత్వ భూములను బుధవారం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ పరిశీలించారు. గ్రామంలోని సర్వేనెం .449/ఏ లోని ప్రభుత్వ భూముల్లో పర్యాటక కేంద్రంతో పాటు బకింగ్ హామ్ కెనాల్ పైన బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. పర్యాటక కేంద్రం ఏర్పాటు, బకింగ్ హామ్ కెనాల్ పైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. దేవరంపాడు నుంచి పడవ ద్వారా బకింగ్ హాం కెనాల్‌లో ప్రయాణించి సముద్రం ఒడ్డుకు వెళ్లి ఆ వైపు భూములను కూడా పరిశీలించారు. జేసీ వెంట ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు రూరల్ తహశీల్దార్ ఎస్కే. నాయబ్ రసూల్, రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది ఉన్నారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీపై చర్యలేవీ



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ అన్నారు. అధిక ఫీజులు, అధిక ధరలకు పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని విమర్శించారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్ల వ్యాపారం మొదలైందన్నారు. పుస్తకాలు, యూనిఫాం, షూల పేరుతో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు బోద్యం చూస్తున్నారని విమర్శించారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఆదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, స్కూలు యాజమాన్యాలు పాటించడం లేదన్నారు. దీంతోపాటు రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై తగిన నియంత్రణ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వి.కోటి, వెంకటరావు, సచిన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అలలు ఎగసి.. వేట సొలసి!



గంగపుత్రుల ఆశలపై కడలి నీళ్లు చల్లుతోంది. రెండు నెలల నిషేధం అనంతరం సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వీరికి ఆశాభంగమే ఎదురవుతోంది. సాగరంలో నెలకొన్న ప్రతికూల వాతావరణం వీరిలో అలజడిని రేపుతోంది. ఏటా 61 రోజుల పాటు మత్స్య సంపద వృద్ధి కోసం చేపల వేటపై నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నిషేధం ముగిశాక బోట్లలో వేటకెళ్లిన మత్స్యకారులకు ఎగసి పడుతున్న అలలు ప్రతిబంధకంగా మారాయి. ఈ సమయంలో పుష్కలంగా చేపలు లభ్యమవుతాయి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా అరకొరగా వలకు చిక్కుతున్నాయి.

- వాతావరణ ప్రభావంతో అలల ఉధృతి
- ఆశాజనకంగా లేని చేపల వేట
- అరకొరగా లభిస్తున్న మత్స్యసంపద
- ఖర్చులకు కూడా రాలేదంటున్న మత్స్యకారులు
- తీరంలో సోనాబోట్ల హల్‌చల్
- బతుకు భారమేనంటున్న మత్స్యకారులు

సింగరాయకొండ:

చేపల పునరుత్పత్తి కోసం ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులు వేట నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇతర పనులు చేసుకుంటూ గడుపుతుండగా ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తోంది. జిల్లాలోని తీరప్రాంతంలో ఉన్న కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలాల పరిధిలో 1,503 బోట్లు ఉన్నాయి. వీటిలో ఇంజన్ బోట్లు 1,111, తెప్ప పడవలు 392 ఉండగా సుమారు 5,800 మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. వేట నిషేధకాలం ముగిసింది చేపల వేటకు వెళ్దాం లాభాలు ఆర్జిస్తామని ఆశపడిన వారికి ఈ సంవత్సరం తీవ్ర నిరాశే మిగిలింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వేట సక్రమంగా సాగడం లేదు.

అలల ఉధృతి:

వాతావరణ ప్రభావంతో సముద్రంలో మూడు రోజులుగా అలల ఉధృతి తీవ్రంగా ఉంది. దీంతో ఆదివారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు సోమవారం చేపల వేటకు వెళ్లలేదు. మంగళవారం అలల ఉధృతి తగ్గిందని భావించిన కొంతమంది మాత్రమే వేటకు వెళ్లారు. ఒకదాని వెంట ఒకటి అలలు ఉధృతంగా వస్తుండటంతో బోట్లు తిరగబడుతున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సముద్రంలో గాలులు ఎక్కువగా వీస్తాయని, ఇదే గాలులు నెల రోజులు పాటు ఉంటాయని అధికారులు చెబుతుండడంతో వేటసాగేనా అంటూ వాపోతున్నారు.ఇదే జరిగితే పూట గడిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోనాబోట్లను అడ్డుకొనేవారే లేరా

తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సోనాబోట్లు నిరాటంకంగా తీరంలో చేపల వేట సాగిస్తుండటంతో మత్స్య సంపద అంతా తుడిచిపెట్టుకుపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా అలల ఉధృతి కారణంగా చేపల వేటకు వెళ్లలేకపోతుంటే సోనాబోట్లు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా తీరంలో వేటాడుతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో మంత్రి స్వామి కేబినెట్ సమావేశంలో సోనాబోట్ల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లారని, దీంతో సమస్య పరిష్కారమవుతుందని మత్స్యకారులు ఆశించారు. కానీ సోనాబోట్లు మాత్రం తీరంలో ఇష్టారాజ్యంగా వేట సాగిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులు, అధికారులు సంయుక్తంగా కొంతవరకు సోనాబోట్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొద్దిరోజులు ప్రభుత్వం సోనాబోట్ల నియంత్రణకు ప్రత్యేక బోటు ఏర్పాటు చేసింది. కానీ కూటమి ప్రభుత్వంలో మాత్రం సోనాబోట్లను అడ్డుకోవటానికి ఒక్క ప్రయత్నమూ చేయలేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, ఏం చేయాలో అర్థం కావటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సోనాబోట్లను అడ్డుకుని మత్స్యసంపద కాపాడాలని వారు కోరుతున్నారు.

అరకొరగా మత్స్య సంపద

సముద్రంలో వేట నిషేధకాలం ముగిసిన తర్వాత వేట ఆశాజనకంగా ఉంటుంది. ఈసారి మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి రోజు ఆదివారం చేపల వేటకు వెళ్లినవారికి కేవలం రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే చేపలు పడ్డాయని తెలిపారు. సోమవారం అలల ఉధృతితో చేపల వేటకు వెళ్లలేదు. మంగళ, బుధవారాల్లో నామమాత్రంగా చేపల వేటకు వెళ్లిన వారికి నిరాశే ఎదురైంది. కూలీ, డీజిల్ ఖర్చులకు మాత్రమే వస్తున్నాయని ఇలాగైతే ఎలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపట్నం తీరంలో సోనాబోటు

సోనాబోట్లతో దోచుకుంటున్నారు

సముద్రంలో అలల ఉధృతి బాగా ఉంది. చేపలు పూర్తి స్థాయిలో లభించటం లేదు. ప్రతి రోజు రూ.10 వేల లోపు చేపలు లభిస్తున్నాయి. తమిళనాడు జాలర్లు సోనాబోట్లపై నిబంధనలకు విరుద్ధంగా తీరానికి దగ్గరలో వేటాడుతూ మత్స్యసంపదను దోచుకుంటున్నారు.

– గొల్లపోతు నాగరాజు, మత్స్యకారుడు, ఊళ్లపాలెం



అరకొరగా మత్స్య సంపద

వేట నిషేధ కాలం పూర్తయిన తరువాత చేపల వేటకు వెళితే మత్స్య సంపద సక్రమంగా లభించక కేవలం రూ.8 వేల చేపలు మాత్రమే పడ్డాయి. వాతావరణ పరిస్థితులతో అలల ఉధృతి కూడా తోడవటంతో వేట ఆశాజనకంగా లేదు.

– కఠారి విజయ్, మత్స్యకారుడు, పాకల



సంద్రంలో తిరగబడిన బోటు

- అర్ధరాత్రి కష్టం మీద తీరానికి చేరుకున్న మత్స్యకారులు
- రూ.లక్షల విలువైన వలలు, మత్స్య సంపద సముద్రంపాలు

కొత్తపట్నం: సముద్రంలో అలల ఉధృతికి బోటు తిరగబడింది. ఈ సంఘటన కొత్తపట్నం సముద్రతీర ప్రాంతంలో చోటుచేసుకుంది. మండలంలోని కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన సింగోతు బాలకృష్ణ, గొల్లపోతు గోవిందు, సింగోతు వెంకటేశ్వర్లు, కొక్కిలగడ్డ రంగారావు, పనమల సుబ్బారావు, నాయుడు యల్లమంద కలిసి మంగళవారం సాయంత్రం 3 గంటలకు సముద్రంలో వేటకు వెళ్లారు. వేట ముగించుకొని అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తీరానికి వస్తుండగా.. తీరానికి 200 మీటర్ల దూరంలో అలల ఉధృతికి బోటు తిరగబడింది. దీంతో బోటులో ఉన్న ఆరుగురు బోటు కింద పడిపోయారు. అందులో నలుగురు అతికష్టం మీద ఈదుకుంటూ తీరానికి చేరుకున్నారు. కొంత సేపటి తరువాత పెద్ద అల రావడంతో బోటు కింద చిక్కుకున్న మరో ఇద్దరు కూడా తీరానికి చేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో బోటులో ఉన్న లక్షల విలువైన వలలు గల్లంతయ్యాయి. అలాగే ఇంజన్ పూర్తిగా పనికి రాకుండా పోయింది. లక్షల విలువైన మత్స్య సంపద కూడా కొట్టుకుపోయింది. గొల్లపోతు గోవిందుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



కాలికి దెబ్బ తగిలిన మత్స్యకారుడు గోవిందు

భాస్కర్‌రెడ్డి అరెస్టు దుర్మార్గం

- ఎమ్మెల్యే, డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



దర్శి(కురిచేడు): మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ని అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి అన్నారు. అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, అక్రమ అరెస్టులు చేయిస్తూ రాజకీయ కక్ష సాధింపునే పరమావధిగా పెట్టుకుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం పాలసీపై కూటమి ప్రభుత్వ కుట్రతో అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతోందన్నారు. అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో కుట్రకు తెరతీసిందని చెప్పారు. ఆ కుట్రలో భాగంగా తాజాగా లుక్ అవుట్ నోటీసులు ఇచ్చి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, ఆయన స్నేహితుడిని మంగళవారం బెంగళూరు విమానాశ్రయంలో ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. అంతటితో ఆగకుండా ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి, మరో నలుగురు పై కేసు నమోదు చేసిందన్నారు. ఈ కేసులో మంగళవారం సాయంత్రం వరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ని సిట్ నిందితులుగా చేర్చనే లేదన్నారు. చెవిరెడ్డి అక్రమ అరెస్టును సంఘటితంగా ఎదుర్కొంటామని, ఆయనకు ఏ సంబంధం లేని లిక్కర్ స్కాంలో అరెస్టు చేయటం ఏమిటని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో చెవిరెడ్డిని భయపెట్టలేరని, విద్యార్థి దశ నుంచి ఉద్యమమే ఊపిరిగా పెట్టుకున్న నాయకుడు ఆయన అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏదో రూపంలో జైలుకు పంపాలనే దుర్బుద్ధితో కుట్ర ద్వారా మద్యం అక్రమ కేసులో అక్రమంగా ఇరికించి వేధింపులకు పాల్పడటమే లక్ష్యంగా అరెస్టు చేయటం అన్యాయం, దురదృష్టకరమని అన్నారు.

చెవిరెడ్డి అరెస్ట్ వెనుక కుట్రకోణం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్ట్ వెనక కూటమి ప్రభుత్వ కుట్రకోణం దాగిఉందని వైపాలెం ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమంగా మద్యం కేసులు బనాయించి ఆయనను అరెస్ట్ చేయడం దారుణమని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, వైఎస్సార్ సీపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న చెవిరెడ్డిని అరెస్ట్ చేసి అధికార పార్టీ పైశాచిక ఆనందం పొందాలనుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన 12 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడపలేని, చేతకాని కూటమి నేతలు వ్యతిరేకతను పక్కదారి పట్టించడంలో భాగంగా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్‌గా చేసుకుంటూ పలు అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ఇటీవల జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడుతున్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌లాంటి వారి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా, రాజకీయ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా, ఆర్థిక మూలాలు కొల్లకొట్టేలా కుట్రలకు పాల్పడుతోందన్నారు. వీరు పెట్టే కేసులు అక్రమమైనవని చెప్పేందుకు కొమ్మినేని శ్రీనివాస్ అరెస్ట్ ఉదంతమే నిలువెత్తు సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ, జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజా మద్దతును తట్టుకోలేని కూటమి ప్రభుత్వం ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ ఒక క్రమపద్ధతిలో అరెస్టులు చేస్తోందన్నారు. ఒక చిన్నస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగిన చెవిరెడ్డి అరెస్ట్, ఆయన కుమారుడిపై మోపుతున్న కేసులు ఏ ఒక్కటి కూడా ఆధారాలతో కాకుండా కక్షలతో మాత్రమే కూడుకున్నవని రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. పల్నాడులో చనిపోయిన పార్టీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించటానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తుంటే 30 చెక్ పోస్టులు పెట్టి అనేక ఆంక్షలతో ప్రజలను ఎక్కడికక్కడ కట్టడి చేసే కుటిల ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టారన్నారు. ఎన్ని కేసులు పెడతామంటున్నా, మీ కడుపు మంటతో అరెస్టులు చేసినా ఈ ఉడుత ఊపులకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని, రోడ్లన్నీ బారికేట్లతో మూసేసినా పొలం గట్లపై నుంచి కదం తొక్కిన ప్రజా ఆగ్రహాన్ని కూటమి నాయకులు గమనించాలన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టులు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు.

నాటక రంగానికి వన్నె తెచ్చిన నాగినేని



నాగినేని నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాటక ప్రముఖులు, కవులు, సాహిత్యవేత్తలు

ఒంగోలు మెట్రో: నాటక రంగంలో సంగీతం, సాహిత్యం, నాట్యం, నటన, రచన దర్శకత్వం వంటి అన్ని విభాగాల్లో ప్రభావశీలమైన, స్ఫూర్తిదాయకమైన బాధ్యతలు నిర్వహించిన హార్మోనిస్టు నాగినేని నరసింహారావు నాటక రంగానికి వన్నెతెచ్చారని పలువురు నాటక ప్రముఖులు, కవులు, సాహితీవేత్తలు పేర్కొన్నారు. నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో నాగినేని నరసింహారావు 17వ వర్ధంతి సభ నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు సంచాలకత్వంలో నిర్వహించిన సభా కార్యక్రమానికి అసోసియేషన్ కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణదేవరాయ సాహిత్య, సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ తన ప్రతిభా పాటవాలతో నాటక రంగ బలోపేతానికి నాగినేని నరసింహారావు తన శాయశక్తులా కృషి చేశారన్నారు. విశ్రాంత జిల్లా అటవీ శాఖ అధికారి గుంటూరు సత్యనారాయణ మాట్లాడుతూ 50 ఏళ్ల పాటు పౌరాణిక నాటక రంగానికి సుదీర్ఘ సేవలను అందించి తనలాంటి ఎందరో కళాకారులను తీర్చిదిద్దిన నరసింహారావు సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఆదాయపు పన్ను అధికారి మేడబలిని సాంబశివరావు, సాహిత్య సంస్థల ప్రతినిధులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, ఓరుగంటి ప్రసాద్, మిట్నసల శాంతారావు, దేవరశెట్టి సింగయ్య, ఐనంపూడి నరసింహారావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, తానికొండ చెన్నయ్య, దామవరపు ముసలయ్య, నలమల్లి పాండురంగనాథం, చోడా రమణయ్య, కొత్తిమీర ప్రేమ్ కుమార్, పాలేటి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సాక్ష్యాలతో అక్రమ అరెస్టు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



ఒంగోలు టౌన్: అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అరెస్టు చేశారని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా లిక్కర్ పాలసీని అమలు చేసిందని చెప్పారు. రెడ్‌బుక్ కుట్రతోనే వైఎస్సార్ సీపీ నాయకుల మీద అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చెవిరెడ్డితో పాటుగా ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, స్నేహితుడు వెంకటేష్ నాయుడును కూడా బెంగళూరు విమానాశ్రయంలో అరెస్టు చేశారన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని, కూటమి పాలకులు కక్ష సాధింపులు మాని పరిపాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు.

జిల్లా వాసులకు యోగాలో రాష్ట్ర స్థాయి బహుమతులు

ఒంగోలు సబర్బన్: అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా వాసులు ఇద్దరికి అవార్డులు దక్కాయి. బుధవారం విజయవాడలో జరిగిన అవార్డు ఫంక్షన్‌లో జిల్లా తరఫున యోగ సాంగ్ కాంపిటీషన్‌లో గెలుపొందిన శీలం శ్రీనివాస రావుకు, యోగ స్కిట్ కాంపిటీషన్‌లో గెలుపొందిన పూర్ణచంద్ర రావు బృంధానికి రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

క్లుప్తంగా

పశువుల కాపరిని బలి తీసుకున్న చెరువు

టంగుటూరు: పశువుల కాపరిని చెరువు బలి తీసుకుంది. ఈ సంఘటన మండలంలోని వల్లూరు చెరువులో మంగళవారం జరగగా బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు వల్లూరు చెరువులో భారీగా మట్టి తరలించారు. ఫలితంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడాయి. ఇటీవల అడపాదడపా వర్షాలు పడగా ఆ గుంతల్లో నీరు చేరాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన ధర్మేంద్ర పశువులు మేపేందుకు ఆ రాష్ట్రానికే చెందిన అరుణ్ (15) అనే యువకుడిని పనికి పెట్టుకున్నాడు. రోజులాగే అరుణ్ పశువులను మేపుకొని తిరిగి వస్తున్న సమయంలో ఒక పశువు బురదలో ఇరుక్కుని పోయింది. ఆ పశువును తప్పించబోయి గుంతలో అరుణ్ జారిపడ్డాడు. చీకటి పడటంతో ఎవరూ గమనించలేకపోయారు. బుధవారం ఉదయం మృతదేహమై కనిపించాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


మృతురాలు సలీమా

మార్కాపురం టౌన్: పట్టణంలోని కరెంటు ఆఫీసు వెనుక నివాసం ఉంటున్న యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం ప్రకారం.. దూదేకుల సిద్దయ్య కుమార్తె సలీమా (20) పదో తరగతి పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉంటూ పూల అల్లకం చేస్తుండేది. కొన్నాళ్లుగా కిడ్నీలో రాళ్లతో పాటు తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ కోతపై రైతుల కన్నెర్ర


సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లూరు: వ్యవసాయ విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వకుండా మరమ్మతుల పేరుతో విద్యుత్‌ను తరుచూ నిలిపేస్తున్న లైన్‌మన్ నిర్వాకంపై బుధవారం రాత్రి తాళ్లూరు దక్షణ ప్రాంత పొలాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం మూడు నాలుగు గంటల పాటు విద్యుత్ కోత విధించడంపై మండిపడ్డారు. విద్యుత్ సరఫరాపై సమాచారం అడిగినా లైన్‌మన్ సక్రమంగా సమాధానం చెప్పడం లేదన్నారు. ఇన్‌చార్జి విద్యుత్ ఏఈ సైతం సమాచారం సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇదే విధంగా విద్యుత్ సరఫరా చేస్తే పంటలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విధానం కొనసాగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

5 కేజీల గంజాయి పట్టివేత

ఒంగోలు టౌన్: ఒడిశా నుంచి గంజాయి తెప్పించి స్థానికంగా విక్రయించే వ్యక్తులను ఒంగోలులో అరెస్టు చేసి వారి వద్ద 5 కేజీల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన కుక్కల గోవర్ధన్ రెడ్డి, ఒడిశాకు చెందిన రాజేష్ నాయక్, ఒంగోలు నగరంలోని బండ్లమిట్టకు చెందిన షేక్ ముజీర్‌లు ఒడిశాకు చెందిన మహేశ్వర్ మురుడి ద్వారా 5 కిలోల గంజాయి తెప్పించారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్లాన్ చేశారు. ఈ క్రమంలో తీసుకొచ్చిన గంజాయిని పంచుకునేందుకు సీతారాంపురం కొండమీదకు చేరుకున్నారు. కొండమీద రామాలయం గుడి వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు వెంటనే దాడి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రేతలను పట్టుకొన్న సీఐ నాగరాజు, ఎస్సైలు సాంబశివరావు, సుబ్రమణ్యంలను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

కూటమి చేతబడి



దేశ భవిష్యత్తుకు పునాది కేంద్రాలైన పాఠశాలలు కూటమి పాలనలో కునారిల్లుతున్నాయనేందుకు ఈ చిత్రాలే సజీవ సాక్ష్యం. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని సర్కారు పాఠశాలలివి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన బడి నాడు-నేడు కార్యక్రమం చేపట్టక ముందు సర్కారు బడుల తీరు ఎవరూ మరువలేదు. తలుపులూడిన గదులు, రంగు వెలిసిన బోర్డులు, విరిగిన బెంచీలు దర్శనమిచ్చే పాఠశాలలను ఓ సంకల్పంతో మార్చి చూపారు వైఎస్ జగన్. అదే ఒరవడిని కొనసాగించి సర్కారు విద్యను పటిష్టం చేయాల్సిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా చోద్యం చూస్తోంది. నాడు-నేడు ఫేజ్-2 కింద జిల్లాలోని 979 పాఠశాలల్లో రూ.471.3 కోట్లతో అభివృద్ధి పనులు, అదనపు గదుల నిర్మాణాలు ప్రారంభించారు. 60 నుంచి 80 శాతం మేర పూర్తయిన ఆ పనులను కూటమి సర్కారు గద్దెనెక్కగానే నిలిపేసింది. - సాక్షి, ఒంగోలు


డీఆర్ఆర్ఎం హైస్కూల్లో నిలిచిన అదనపు గదులు


బండ్లమిట్ట బాలికల ప్రాథమికోన్నత పాఠశాల వరండాలో తరగతుల నిర్వహణ


ఒంగోలు నగరం సత్యనారాయణపురంలో అసంపూర్తిగా ప్రాథమిక పాఠశాల(ఈ స్కూల్లో 125 మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 80కి తగ్గింది)


బాలాజీనగర్ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో ఇలా..


పీవీఆర్ బాలుర హైస్కూల్ ఆవరణలో చివరి దశలో పనులు నిలిచిన గదులు


రామ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్లో అర్ధంతరంగా నిలిచిన పనులు


బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల హైస్కూల్లో అసంపూర్తి భవనంలో విద్యా బోధన


బాలాజీనగర్ నగరపాలక హైస్కూల్ వరండాలో పాఠాల బోధన


బాలాజీనగర్ హైస్కూల్ భవనంపై అసంపూర్తిగా అదనపు గదులు

చంద్రబాబు అంటేనే మోసం


పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి (కురిచేడు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికే హామీలన్నీ అమలు చేసి అందరి మన్ననలు పొందారని, చంద్రబాబు సీఎం అయ్యాక ఏడాదిలో ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం దర్శిలోని పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శాంతి, సుస్థిరత, మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించి ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పటిష్టమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంలో భాగంగా వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించి వారి మనస్సుల్లో సుస్థిర స్థానం సాధించారన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చి పేదవాడు సైతం కార్పొరేట్ విద్య అందుకునేలా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు నగదు పెంచి కరోనా వంటి భయంకర వ్యాధులను సైతం ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందించిన గొప్ప ముఖ్యమంత్రిగా దేశంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శంగా నలిచారని కొనియాడారు. వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలు వచ్చేలా చేసిన ఘనత ఆయనదేనన్నారు. అవసరమైన సమయంలో మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేసి రైతులకు మేలు చేసిన రైతు పక్షపాతి అప్పటి ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో పంటనష్టం నుంచి రైతులను ఆదుకునేందుకు పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించి వారికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో అశాంతి, అరాచకం, ఆటవిక పాలనే సాగిందని దుయ్యబట్టారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి విద్యార్థులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఏటా రైతులకు పంటసాగు సాయం కింద రూ.20 వేల ప్రకారం చెల్లిస్తామని హామీ ఇచ్చి రెండో ఏడాది వచ్చినా రైతులకు మొండిచేయి చూపిన మోసగాడు చంద్రబాబు..అని ఎమ్మెల్యే బూచేపల్లి మండిపడ్డారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిపై నోరు మెదపటం లేదని, మహిళలకు ఇచ్చే ఉచిత బస్సు తుస్సుమందని ఎద్దేవా చేశారు. అందరికీ తల్లికి వందనం అందిస్తామని చెప్పి అడ్డంకులు సృష్టించి భారీ కోతలు పెట్టారని విమర్శించారు. చంద్రబాబు ఏడాది పాలనలో వ్యతిరేకత, జగనన్నపై తరగని అభిమానంతోనే ప్రజలు చంద్రబాబు ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్వచ్ఛందంగా వెల్లువలా పోరుబాటలో పాల్గొంటున్నారని వివరించారు. చంద్రబాబు ఈ ఏడాదిలో ప్రజా సంస్కరణలను విస్మరించి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడంపైనే దృష్టి సారించారని మండిపడ్డారు. ఏడాది కాలంలో ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని దుయ్యబట్టారు. అప్పులు చంద్రబాబు, కూటమి నాయకులకు సంపదను సృష్టించేందుకు ఉపయోగపడ్డాయి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే బూచేపల్లి విమర్శించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు మెన్నపూస వెంకటరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, వైవీ సుబ్బయ్య, కాకర్ల కృష్ణారెడ్డి, అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

200 బత్తాయి చెట్లు నరికివేత

- సోలార్ ప్యానళ్లు, ఫెన్సింగ్ ధ్వంసం
- పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు


గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసిన బత్తాయి చెట్లు

పామూరు: వివాదంలో ఉన్న పొలంలో బత్తాయి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు కూకటి వేళ్లతో సహా పెకిలించారు. ఈ సంఘటన పామూరు మండలంలోని గుమ్మనంపాడులో బుధవారం ఉదయం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన రైతు అబ్బూరి శేషయ్య బత్తాయి తోట సాగుచేస్తున్న పొలంపై వివాదం నెలకొంది. బుధవారం ఉదయం బత్తాయి చెట్లకు నీరు పెట్టేందుకు వెళ్లగా సుమారు 200కు పైగా బత్తాయి చెట్లను జేసీబీతో పెకలించి, సోలార్ ప్యానళ్లు, ఫెన్సింగ్ ధ్వంసం చేశారు. దీంతో నిశ్చేష్టుడైన శేషయ్య చీమకుర్తికి చెందిన వ్యక్తిపై అనుమానంగా ఉందని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' బిల్లుల తనిఖీ

గిద్దలూరు రూరల్: గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన బిల్లులను విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. గిద్దలూరు ఎంపీడీఓ కార్యాలయంలో సోదాల అనంతరం రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల పంచాయతీ కార్యదర్శులు, గిద్దలూరు మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర రికార్డులు, ఖర్చు చేసిన బిల్లులను అధికారుల నుంచి సేకరించారు.

కోత మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- రూ.40 లక్షల ఆస్తి నష్టం
- కాలిబూడిదైన టేకు చెక్కలు, ఇతర సామగ్రి


కాలిబూడిదైన చెక్కలు, యంత్రాలు


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దర్శి (కురిచేడు): దర్శి నగర పంచాయతీ పరిధి పుచ్చలమెట్టలో శ్రీలక్ష్మి వెంకటేశ్వర టింబర్ డిపోకు మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూటై రూ.40 లక్షల ఆస్తి నష్టం జరిగింది. టేకు చెక్కలు, విద్యుత్ పరికరాలు, కాలి బూడిదయ్యాయి. టింబర్ డిపో యజమాని మారం శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం..

మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద పెద్ద శబ్ధాలు రావడంతో ఇంట్లో నిద్రపోతున్న శ్రీనివాసరెడ్డికి స్థానికులు సమాచారం ఇచ్చారు. శ్రీనివాసరెడ్డి వచ్చి చూసేసరికి భారీగా మంటలు వ్యాపించి టింబర్ డిపోలో మొత్తం పొగ కమ్ముకుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వాహనం వచ్చి మంటలు అదుపు చేసింది. టింబర్ డిపోలో ఉన్న టేకు కర్రలు, ఇతర సామగ్రితో పాటు మిషనరీలు, ఇతర విద్యుత్ పరికరాలు, యంత్రాలు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీనివాసరెడ్డి కోరుతున్నారు.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అక్రమం

- కనిగిరి, గిద్దలూరులో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన
- కూటమి కక్ష సాధింపు చర్యలకు బెదిరేది లేదని ప్రతిన


ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ కనిగిరిలో ప్లకార్డుల ప్రదర్శన


గిద్దలూరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జీ ఆదినారాయణరెడ్డి, రైతు సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు పోలక సిద్ధారెడ్డి ధ్వజమెత్తారు. పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పార్టీ ఆఫీస్‌లో ‹సేవ్ డెమోక్రసీ–సేవ్ ఏపీ› వాల్ పోస్టర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. హామీల అమలు, సర్కార్ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి నేతల బెదిరింపులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై పోరాడతామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరసాని మోహన్‌రెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ నాయబ్ రసూల్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ఎస్కే జిలానీ బాషా, ఎం.నాగమణి, ఎస్కే షకీలా, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, మితికల వెంకట్, శీలం శివారెడ్డి, చిలంకూరి కొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

గిద్దలూరు రూరల్: తప్పుడు కేసులు పెట్టి, అక్రమ అరెస్టులు చేస్తే వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడతాయనుకోవడం కూటమి నేతల భ్రమేనని గిద్దలూరు నగర అధ్యక్షుడు మానం బాలిరెడ్డి పేర్కొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానం బాలిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ కుట్రలను అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏ సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డిని ఉద్దేశపూర్వకంగా ఇరికించడం రెడ్ బుక్ కుట్రలో భాగమేనని మండిపడ్డారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండారి నోవెల్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలుగుళ్ల సుబ్బారెడ్డి, నంద్యాల బాలుయాదవ్, కావేరి, వెంకటరావు, నాసరి శ్రీను, పోలేపల్లె శివ, పాలుగుళ్ల నరసింహారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.